## గ్రామాలాభివృద్ధికి సీఎం కేసీఆర్ కృషి

◆ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి



పెద్దకొత్తపల్లిలో యువతకు స్పోర్ట్స్ కిట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే బీరం

పెద్దకొత్తపల్లి, అక్టోబర్ 5: గ్రామాలాభివృద్ధి కోసం సీఎం కేసీఆర్ నిధులు మంజూరు చేస్తున్నారని ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. మండలంలోని మహాసముద్రంలో రూర్బన్ పథకం కింద రూ.15.75లక్షలతో నిర్మించిన నూతన పంచాయతీ భవనాన్ని ఎమ్మెల్యే బీరం, సర్పంచ్ ఘట్టయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు డప్పులతో ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం మహిళలకు బతుకమ్మ చీరలు, యువతకు కేసీఆర్ స్పోర్ట్స్ కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పల్లెప్రగతితోనే బంగారు తెలంగాణ సాధ్యమని భావించి పల్లెలను అభివృద్ధి దిశగా పయనించేలా కేసీఆర్ కృషి చేస్తున్నారన్నారు. పంచాయతీలకు ప్రత్యేకంగా నిధులు మంజూరు చేసి పల్లెల సర్వతోముఖాభివృద్ధే లక్ష్యంగా బీఆర్ఎస్ ప్రభుత్వం పనిచేస్తుందని పేర్కొన్నారు. అదేవిధంగా కల్వకోలులో రూ.20లక్షలతో నిర్మించే నూతన పంచాయతీ భవనానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమాల్లో ఉప సర్పంచ్ సుగుణమ్మ, వార్డు సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

# పల్లెప్రగతితోనే బంగారు తెలంగాణ

◆ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి

◆ ఎల్లూరులో జీపీ భవనం ప్రారంభం, బతుకమ్మ చీరలు, స్పోర్ట్స్ కిట్లు పంపిణీ

కొల్లాపూర్, అక్టోబర్ 5: ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు బంగారు తెలంగాణ సాధనే లక్ష్యంగా అహర్నిశలు శ్రమిస్తున్నారని ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని ఎల్లూరులో రూ.20లక్షలతో నిర్మించిన జీపీ కార్యాలయం భవనాన్ని సర్పంచ్ లక్ష్మీదేవమ్మ, ఎంపీటీసీలు మంజుల, శంకర్‌నాయక్‌తో కలిసి ఎమ్మెల్యే బీరం గురువారం ప్రారంభించారు. అనంతరం బతుకమ్మ చీరలు, స్పోర్ట్స్ కిట్లను పంపిణీ చేశారు. ముందుగా నూతనంగా ఏర్పాటు చేసిన మహాత్మాగాంధీ విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పల్లెసీమలు అభివృద్ధి దిశగా పయనించేలా సీఎం కేసీఆర్ కృషిచేస్తున్నారన్నారు. అంతకుముందు ఎమ్మెల్యేను సర్పంచ్ లక్ష్మీదేవమ్మ శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో గొర్రెల కాపరుల సహకార సంఘం జిల్లా అధ్యక్షుడు గాలియాదవ్, ఎంపీపీ సభావట్ భోజ్యానాయక్, మాజీ సర్పంచ్ చంద్రశేఖర్‌శెట్టి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రాంచందర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



మహాసముద్రంలో బతుకమ్మ చీరలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి

## మహిళలకు తెలంగాణ ప్రభుత్వ కానుక

◆ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి

పెద్దకొత్తపల్లి, అక్టోబర్ 5: దసరా పండుగను పురస్కరించుకొని ముఖ్యమంత్రి కేసీఆర్ మహిళలకు బతుకమ్మ చీరలు అందిస్తున్నారని ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో యువతకు కేసీఆర్ స్పోర్ట్స్ కిట్లు, బతుకమ్మ చీరలను గురువారం ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాలవారీగా బతుకమ్మ చీరలను అధికారులు ఆడబిడ్డలందరికీ అందజేయాలని సూచించారు. కొల్లాపూర్ నియోజకవర్గంలో చేపడుతున్న అభివృద్ధిని ప్రజలు గమనిస్తున్నారన్నారు. విద్యార్థులు చదువు, క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలని యువతకు సూచించారు. క్రీడలను ప్రోత్సహించేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రతిగ్రామంలో క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేసిందని, గ్రామీణ ప్రాంతాల నుంచి క్రీడాకారులను ప్రోత్సహించడమే ప్రధాన ఉద్దేశమన్నారు. విద్యార్థులు ఉన్నతులుగా ఎదగాలని, ప్రతిభావంతులుగా రాణించాలన్నదే కేసీఆర్ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో విండో చైర్మన్ రాజగౌడ్, ఎంపీటీసీ రేణుక, ఎంపీడీవో కృష్ణయ్య, రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు నాగరాజు, మాజీ సర్పంచ్ నర్సింహ, మాజీ ఎంపీపీ వెంకటేశ్వర్‌రావు, బీఆర్ఎస్ మండల నాయకులు రవినాయక్, మోహన్‌రెడ్డి, వెంకటయ్య, మైసమ్మబోర్డు సభ్యుడు అశోక్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## యాపట్లలో స్వచ్ఛభారత్



యాపట్లలో శ్రమదానం చేస్తున్న మహిళలు

పెద్దకొత్తపల్లి, అక్టోబర్ 5: మండలంలోని యాపట్లలో ఆర్డీటీ సంస్థ ఆధ్వర్యంలో గురువారం స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో పారిశుధ్యం పనులు చేపట్టారు. ముళ్లపొదలు, పిచ్చిమొక్కలు తొలగించి వీధులను శుభ్రం చేశారు. సంస్థ ఆర్గనైజర్ సురేశ్ మాట్లాడుతూ.. సేవాభావంతో గ్రామంలో స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించి వీధులను శుభ్రపరిచినట్లు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యార్థినులకు బహుమతుల ప్రదానం



బహుమతులను ప్రదానం చేస్తున్న కమిషనర్ రాజయ్య

కొల్లాపూర్, అక్టోబర్ 5: స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో వారం రోజులుగా విద్యార్థినులకు నిర్వహించిన ముగ్గుల పోటీల్లో విజేతలకు గురువారం మున్సిపల్ కమిషనర్ రాజయ్య బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. విద్యార్థినులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, ఈఈ జమీర్‌పాషా, బిల్ కలెక్టర్ నాగరాజు, సిబ్బంది ఈశ్వర్, నాగ్, మొహమ్మద్, అఖిల్, జాఫర్ పాల్గొన్నారు.

## షిరిడీసాయి ఆలయంలో పూజలు

పెంట్లవెల్లి, అక్టోబర్ 5: మండల కేంద్రం సమీపంలో వెలిసిన సాయినాథుడి ఆలయంలో గురువారం ఘనంగా పూజాకార్యక్రమాలు నిర్వహించారు. మండల కేంద్రం నుంచేకాక సమీప గ్రామాలైన రామాపురం, కొండూరు, కొల్లాపూర్, నర్సింగరావుపల్లి, జటప్రోల్, గోప్లాపురంతోపాటు వివిధ దూరప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని సాయినాథుడికి ఘనంగా పూజలు చేసి తమ మొక్కులు చెల్లించుకున్నారు. ఉదయం నుంచి రాత్రివరకు సాయి మందిరం సాయిబాబ భక్తికీర్తనలతో మారుమోగింది. అనంతరం భక్తులకు తీర్థప్రసాద వితరణ చేసినట్లు ఆలయ పూజారి ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

# జూనియర్ కళాశాల మంజూరుపై హర్షం

◆ సీఎం కేసీఆర్ చిత్రపటానికి ఎమ్మెల్యే బీరం, ప్రజాప్రతినిధుల క్షీరాభిషేకం

పెద్దకొత్తపల్లి, అక్టోబర్ 5: పెద్దకొత్తపల్లి మండలానికి ప్రభుత్వం కళాశాల మంజూరు చేయడంపై విద్యాభిమానులు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా బస్టాండ్ చౌరస్తాలో పటాకులు కాల్చి సీఎం కేసీఆర్ చిత్రపటానికి ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి, విండో చైర్మన్ రాజగౌడ్, రైతుబంధు సమితి మండలాధ్యక్షుడు నాగరాజు, ఎంపీటీసీ రేణుక క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నో ఏండ్ల కలను నెరవేర్చినందుకు మండల ప్రజలు, విద్యాభిమానులు సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. కొల్లాపూర్‌లో హార్టికల్చరల్, పాలిటెక్నికల్ కళాశాలలను మంజూరు చేయించాలని గుర్తు చేశారు. పెద్దకొత్తపల్లి మండలానికి రూ.33కోట్లతో బాచారం హైలెవల్ పనులు, వివిధ అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయించినట్లు వెల్లడించారు. మండల ప్రజలు, బీఆర్ఎస్ నాయకులు ప్రత్యేకంగా ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.



పెద్దకొత్తపల్లిలో సీఎం కేసీఆర్ చిత్ర పటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే బీరం

## ఆయిల్‌పాం సాగుకు దరఖాస్తులు చేసుకోవాలి

పెంట్లవెల్లి, అక్టోబర్ 5: కొల్లాపూర్ డివిజన్ పరిధిలోని పెంట్లవెల్లి, పెద్దకొత్తపల్లి, కోడేరు, కొల్లాపూర్ మండలాల్లోని వివిధ గ్రామాల రైతులు ఆయిల్ పాం సాగు కోసం దరఖాస్తులు చేసుకోవాలని కొల్లాపూర్ డివిజన్ ఉద్యానశాఖ అధికారి లక్ష్మణ్ గురువారం ప్రకటనలో కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2023-24 సంవత్సరానికిగానూ యాసంగిలో ఆయిల్‌పాంను సాగు చేయాలనుకున్న రైతులు భూమి పట్టాదారు పాసుబుక్, ఆధార్‌కార్డు, బ్యాంకు ఖాతా జిరాక్స్, ఆర్‌వోఆర్, రైతు పాస్‌ఫొటోతోపాటు మూడు జతల జిరాక్స్‌లను తమ కార్యాలయంలో అందజేయాలని కోరారు. ఆయిల్‌పాం మొక్కలను సీనియారిటీ ప్రకారం అందజేయడం జరుగుతుందని, ఆసక్తి ఉన్న రైతులు ముందుగానే పత్రాలను అందజేయాలని కోరారు. పూర్తి వివరాలకు 7797725185 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

# మహిళలకు బతుకమ్మ చీరలు పంపిణీ

కోడేరు, అక్టోబర్ 5: బతుకమ్మ పండుగను మహిళలు ఆనందంగా జరుపుకోవాలనే ఉద్దేశంతోనే రాష్ట్ర ప్రభుత్వం దసరా పండుగకు కానుకగా బతుకమ్మ చీరలను అందజేస్తున్నదని జనుంపల్లి సర్పంచ్ కవిత పేర్కొన్నారు. మండలంలోని జనుంపల్లిలో గురువారం మహిళలకు బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. కార్యక్రమానికి సర్పంచ్ హాజరై మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రతిఏటా మహిళలకు బతుకమ్మ చీరలను అందజేస్తున్నదని పేర్కొన్నారు. ప్రభుత్వం అందజేస్తున్న చీరలను ప్రతిఒక్కరికీ అందేవిధంగా చూడాలని సూచించారు. చీరలను మహిళలు తీసుకొని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు చిన్నకుర్మయ్య, వార్డుసభ్యులు జయమ్మ, అక్కమ్మ, చెన్నమ్మ, డీలర్ కృష్ణయ్య పాల్గొన్నారు.

***అమ్రాబాద్ మండలంలో..***

అమ్రాబాద్, అక్టోబర్ 5: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా దసరా కానుకగా ఆడపడుచులకు అందజేస్తున్న బతుకమ్మ చీరల పంపిణీ కార్యక్రమం అమ్రాబాద్ మండలంలోని మన్ననూర్ సర్పంచ్ శ్రీరాంనాయక్ ఆధ్వర్యంలో గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మహిళలకు బతుకమ్మ చీరలను అందజేశారు. ప్రత్యేక తెలంగాణ వచ్చిన అనంతరం మహిళల ఆత్మగౌరవాన్ని నిలిపేలా అన్ని కార్యక్రమాలతోపాటు బతుకమ్మ చీరలను ప్రత్యేకంగా అందజేస్తున్నదని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, నాయకులు సత్యనారాయణ, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

***ఉప్పునుంతల మండలంలో..***

ఉప్పునుంతల, అక్టోబర్ 5: మండలంలోని తాడూర్, కొరటికల్, పెద్దాపూర్ తదితర గ్రామాల్లో గురువారం అధికారులు బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. ప్రభుత్వం ప్రతి సంవత్సరం దసరా కానుకగా ఆడపడచులకు చీరలను అందజేస్తున్నదని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో లక్ష్మణ్‌రావు, సర్పంచులు, రమేశ్‌రెడ్డి, శిరీష, అలివేలు తదితరులు పాల్గొన్నారు.



కొరటికల్‌లో బతుకమ్మ చీరలను అందజేస్తున్న ఎంపీడీవో



జనుంపల్లిలో బతుకమ్మ చీరలను అందజేస్తున్న సర్పంచ్ కవిత



మన్ననూర్‌లో బతుకమ్మ చీరలను అందజేస్తున్న సర్పంచ్ శ్రీరాంనాయక్